30వ అధ్యాయం

# ٣٠ ـ بَابُ الشَّفَاعَةِ

# సిఫారసు చేయటం

قال الله تعالى: ﴿مَّن يَشْفَعْ شَفَٰعَةً حَسَنَةً يَكُن لَّهُۥ نَصِيبٌ مِّنْهَا﴾ [النساء: ٨٥].

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు:

"మంచి విషయం నిమిత్తం సిఫారసు చేసేవాడికీ అందులో భాగం లభిస్తుంది."

(అన్ నిసా : 85)

٢٤٨ ـ وعن أبي موسى الأشعريِّ رضي الله عنه قال: كان النَّبيُّ ﷺ إذا أتاهُ طَالِبُ حاجَةٍ أَقْبَلَ عَلَى جُلَسَائِهِ فقال: «اشْفَعُوا تُؤْجَرُوا وَيَقْضِي اللهُ عَلَى لِسَانِ نَبِيِّهِ مَا أَحَبَّ» متفقٌ عليه. وفي رواية: «مَا شَاءَ».

248. హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) తన దగ్గరికి ఎవరైనా అవసరంలో ఉన్న వ్యక్తి వచ్చి (సహాయం చేయమని కోరితే) ఆయన తనతోపాటు కూర్చునివున్న వారితో "ఇతని కోసం సిఫారసు చేయండి. దానివల్ల మీకూ పుణ్యం లభిస్తుంది. దేవుడు తాను తలచిన నిర్ణయాన్ని తన ప్రవక్తనోట వెలువరిస్తాడు" అని అనేవారు. *(బుఖారీ - ముస్లిం)*

వేరొక ఉల్లేఖనంలో "మా అహబ్బ"కు బదులు 'మా షాఅ' అని ఉంది. (రెండింటి అర్థం ఒక్కటే).

*(సహీహ్ బుఖారీలోని జకాత్ ప్రకరణంలోనూ, ఇంకా సహీహ్ ముస్లింలోని సత్కార్యాలు - సత్సంబంధాల ప్రకరణంలోనూ ఈ హదీసు పొందుపరచబడి ఉంది.)*

### ముఖ్యాంశాలు

ధర్మసమ్మతమైన విషయాల్లో తోటి సోదరుల కొరకు సిఫారసు చేయటం పుణ్యప్రదమే. కాని నిషిద్ధ విషయాల్లోగాని లేక షరీఅత్ విధించిన శిక్షల్ని రద్దుచేయమని గాని సిఫారసు చేసే అనుమతి, అర్హత ఎవరికీ లేదు.

٢٤٩ - وعن ابنِ عباسٍ رضي الله عنهما في قِصَّةِ بَرِيرَةَ وَزَوْجِهَا قال: قال لَهَا النَّبِيُّ ﷺ: «لَوْ رَاجَعْتِهِ؟» قَالَتْ: يَا رَسُولَ اللهِ! تَأْمُرُنِي؟ قال: «إِنَّمَا أَشْفَعُ» قَالَتْ: لا حَاجَةَ لِي فِيهِ. رواه البخاري.

249. బరీరా మరియు ఆవిడ భర్తకు సంబంధించిన సంఘటన గురించి హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) చేసిన కథనం : దైవప్రవక్త (సల్లం) ఆమెతో, "నీవు నీ భర్త (ముగీస్) దగ్గరికి తిరిగి వెళ్ళిపోతే (బాగుంటుంది)" అని అన్నారు. దానికి ఆమె, "(నేను తిరిగి నా భర్త దగ్గరికి వెళ్ళాలని) ఆజ్ఞాపిస్తు న్నారా దైవప్రవక్తా!" అని అడిగింది. అందుకాయన "(లేదు లేదు) నేను కేవలం సిఫారసు చేస్తున్నానంతే" అన్నారు. దానికి ఆమె, "నాకు ఆయన అవసరం లేదు" అని తెగేసి చెప్పింది. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని విడాకుల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

హజ్రత్ బరీరా (రజి.అన్హా) దైవప్రవక్త ప్రియసతీమణి ఆయిషా (రజి.అన్హా) గారి బానిసరాలు. ఈమె ముగీస్ అనే బానిసను వివాహమాడారు. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) ఈమెకు బానిసత్వం నుండి స్వేచ్ఛ నొసగారు. బానిసత్వం నుండి స్వేచ్ఛపొందిన స్త్రీకి తన బానిస భర్తతో సంసారం చేయటం యిష్టం లేకపోతే తన వివాహ బంధాన్ని త్రెంచుకునే హక్కు ఇచ్చింది ఇస్లాం ధర్మం. దాని ప్రకారం ఈమె కూడా తన హక్కును వినియోగించుకుంటూ తన భర్త ముగీస్ నుండి విడిపోయారు. కాని ముగీస్‌కు మాత్రం బరీరా అంటే వల్లమాలిన ప్రేమ. ఆమె ఎక్కడికి వెళ్ళినా ఇతను ఆమెను అనుసరిస్తూ తిరిగేవాడు. తనతో వివాహబంధాన్ని త్రెంచుకోవద్దని ప్రాధేయపడేవాడు. దైవప్రవక్తకు ఈ విషయం తెలిసింది. ఆయన ముగీస్ దైన్యస్థితికి జాలిపడ్డారు. అతనితో వివాహబంధాన్ని పునర్నిర్మించుకోమని బరీరాకు సిఫారసు చేశారు. కాని లాభం లేకపోయింది. ఇది షరీఅత్ ఆజ్ఞ అయితే కాదు కదా! ఇది కేవలం సలహా మరియు సిఫారసు మాత్రమే. అందుకని హజ్రత్ బరీరా (రజి.అన్హా)గారు ఈ సలహా తనకు ప్రయోజనకరమైనది కాదని తలపోసి దైవప్రవక్త (స) చేసిన సిఫారసును ఒప్పుకోలేదు. దీనిద్వారా ఇస్లాం ధర్మం వ్యక్తిగత హక్కుల్ని సమ్మతించి ఆమోదించిందని తెలుస్తోంది. ఇస్లాం వ్యక్తుల హక్కుల్ని గౌరవిస్తుంది. అయితే ఆ హక్కుల వినియోగం షరీఅత్ పరిమితులకు లోబడి ఉండాలి. షరీఅత్ ప్రసాదించిన స్వేచ్ఛను హరించడానికి ఎవరికీ అధికారం లేదు.